ప్రజాశక్తి

బుధవారం 8 మార్చి 2023 | 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల

ప్రతిష్ఠాత్మకమేనా.?

ప్రజాసమస్యలు పట్టవా.?



- ఎమ్మెల్సీ ఎన్నికలపై రెండు పార్టీల్లోనూ ఇదే ధోరణి
- గెలుపు కోసం పార్టీలు తహతహ.. ప్రలోభాలకూ వ్యూహాలు
- ప్రజా సమస్యలే ఎజెండాగా పిడిఎఫ్ అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'మనకు ఈ ఎన్నికలే ప్రతిష్టాత్మకం.. రాష్ట్రంలో జగన్‌కు బుద్ధి చెప్పాలన్నా ఈ ఎన్నికల్లో గెలుపే మైలురాయి. గట్టిగా పనిచేస్తేనే పార్టీకి భవిష్యత్' అంటూ తెలుగుదేశం నేతలు కార్యకర్తలకు నూరిపోస్తున్నారు.


ఒంగోలులో ఓట్లను అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి (ఫైల్)

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తేనే తెలుగుదేశం పార్టీకి మళ్లీ గట్టి పోటీనిస్తాం. పట్టుకోల్పోకుండా ఉంటాం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలి' అని వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు క్షేత్రస్థాయి సమావేశాల్లో గగ్గోలు పెడుతున్నారు.

వాస్తవానికి ఈ రెండు పార్టీలూ ప్రజాపోరాటాల నుంచి వచ్చిన పిడిఎఫ్ అభ్యర్థులపైనే పోటీకి దిగుతున్నాయి. వీరిని ఏదో రకంగా ఓడిస్తే మండలిలో సమస్యలే ఉండవనే భావనలో ఉన్నాయి. అందుకే పాలక, ప్రతిపక్షాలు రెండూ అభ్యర్థులను దింపాయి.

ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపించే కొద్దీ పార్టీలు కూడా సమావేశాలు పెడుతూ సమాయత్తం చేస్తున్నాయి. తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చంనాయుడు మంగళవారం నాడు ఒంగోలు వచ్చారు. పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలతో సమావేశమయ్యారు. వైసిపి, పిడిఎఫ్ నుంచి వస్తున్న పోటీపైనా చర్చించారు. గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు పార్టీ భవిష్యత్‌కు కీలకమని, రాష్ట్రంలో జగన్ పాలన పోవాలంటే ఈ ఎన్నికల్లో గెలుపే కీలకమని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. సిఎం జగన్‌పైనా, ప్రభుత్వం తీరుపైనా ధ్వజమెత్తారు. ▶ 2లో


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

పిడిఎఫ్ అభ్యర్థుల విజయంతోనే

ప్రజాసమస్యలు పరిష్కారం 2లో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో బోగస్ ఓట్లు 7లో

ప్రతిష్టాత్మకమేనా.? ప్రజాసమస్యలు పట్టవా.?

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, ఇతర వర్గాల సమస్యలపై చర్చ లేదు. కేవలం గెలుపు కోసం పార్టీ క్యాడర్ కష్టపడి పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ఓట్లు ఆశించేందుకు ఎజెండా అటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. వైసిపి విషయానికి వస్తే పార్టీ ఎమ్మెల్యేలు సమావేశాలు పెట్టి కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. పాలనావ్యవస్థను వినియోగించుకొని అన్ని వ్యవహారాలూ చేస్తున్నారు. ఉపాధ్యాయులను బెదిరిస్తున్నారు. ప్రచారంలోకి వెళ్లకుండా భయపెడుతున్నారు. ప్రైవేటు టీచర్లను వినియోగించుకొని గెలవాలనే ఆలోచన చేస్తున్నారు. వీరి ఎజెండా ఒక్కటే పిడిఎఫ్ ఎమ్మెల్సీలను రాకుండా చేయడమే.. వస్తే అన్ని రకాల సమస్యలు ప్రస్తావించడంతో పాటు ఉద్యోగుల పోరాటాలకు నేతృత్వం వహిస్తారన్నదే ప్రధాన ఆలోచన. ఇవన్నీ లేకుండా చేయాలంటే పిడిఎఫ్ నుంచి ఎవరినీ రాకుండా చేస్తే సరిపోతుందన్నదే వ్యూహం. రెండు పార్టీల ధోరణి ఒకటే. గెలుపు తప్ప ఓట్లు వేసే వర్గాల సమస్యలు లేవు. వీరికి ఎజెండా అంటూ ఏమీ లేదు. గెలుపు ఒక్కటే. సిపిఎస్ రద్దుపై రెండు పార్టీలు ఒకటే ఆలోచనలో ఉన్నాయి. గతంలో చంద్రబాబు సిపిఎస్ రద్దుపై మౌనంగా ఉన్నారు. ఎన్నో పోరాటాలు జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి. రద్దుపై సిఎం జగన్ కూడా ఇదే ధోరణిలో ఉన్నారు. సిపిఎస్‌పై వైసిపి, తెలుగుదేశం అభ్యర్థులు ఏమి చెబుతారన్నదే ప్రశ్న. ఏమీ చెప్పడం లేదు. పిఆర్‌సి, ఉద్యోగుల వేతనాలపైనా చర్చే లేదు. రెండు పార్టీల నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు ఈ సమస్యలపై మాట్లాడే అవకాశమే లేదు. మరో వైపు ఉద్యోగులు పోరాటాలకు సిద్ధమవుతున్నారు. జేఏసీ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. తమను మోసం చేసిందనే చర్చ వస్తోంది. రానున్న కాలంలో పోరాటాలు తప్పవని ఉద్యోగుల జేఏసీ నేతలు ప్రకటనలు చేస్తున్నారు. భవిష్యత్‌లో జరగబోయే పోరాటాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కీలకపాత్ర పోషిస్తారు. ఈ భయం కూడా రాజకీయపార్టీలకు పట్టుకుంది. అందుకే పార్టీలు వ్యూహాలు రచిస్తున్నారు. అన్ని రకాల ప్రలోభాలకు దిగుతున్నాయి. ప్రతిష్టలను ముందుకు తెస్తున్నాయి. పార్టీల పరంగా వీటిని మార్చుతున్నారు. ఓటుకు నోటు ఇవ్వాలనే నిర్ణయాల్లో ఉన్నారు. ఏదేమైనా ఎన్నికల్లో పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు గెలుపు కోసం అన్ని దారులూ చూస్తున్నారు. ఇక ప్రజాగొంతుకే ఎజెండాతో పిడిఎఫ్ అభ్యర్థులు ముందున్నారు. గతంలో చేసిన పోరాటాలు, భవిష్యత్‌లో ఏఏ వర్గాల సమస్యలపై ఎలా స్పందించి పోరాటాలు చేస్తామనేదీ ప్రకటించారు. పిడిఎఫ్ ఎజండానే ప్రజా సమస్యలు. వాటి కోసం మండలి లోపలా..బయటా.. పోరాటాలు చేయడమే. దీన్నే ప్రచారంలో చెబుతూ ముందుకుపోతున్నారు.

నిందితుడికి జైలు శిక్ష

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గుర్తుతెలియని వ్యక్తులు గతేడాది నవంబర్‌లో అమరాన్ బ్యాటరీ దుకాణం తాళం పగులకొట్టి రూ.58 వేల నగదును అహరించారు. ఈ మేరకు దుకాణం యాజమాని శ్రీహరి ఫిర్యాదు మేరకు మార్కాపురం పట్టణ ఎస్ఐ శశికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా గతేడాది నంబరులో గుంటూరు జిల్లా ముద్దాయి దాసరిపాలెంకు తుపాకుల వెంకటేశ్వర్లును నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.48,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపారు. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో మార్కాపురం అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. ఆదినారాయణ ముద్దాయికి రెండు సంవత్సరాల జైలు శిక్ష రూ.6 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.. సరైన సాక్ష్యాలు కోర్టులో ప్రవేశ పెట్టి నిందితుడుకి శిక్షిపడేలా కషి చేసిన మార్కాపురం టౌన్ ఎస్ఐ శశి కుమార్, కోర్ట్ లైసన్ హెడ్ కానిస్టేబుల్ ఐవి. శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ యస్.భాస్కర్‌ను ఎస్‌పి మల్లిక గర్గ్ అభినందించారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ

శింగరాయకొండ : స్థానిక భాష్యం పాఠశాలలో స్టై మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాష్యం విద్యార్థులు తమ ప్రతిభను చాటి 6 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాల మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ వరికూటి యెహోషువా, ప్రకాశం జోన్ భాష్యం విద్యాసంస్థల జన్ఇఒ కృష్ణ గణేష్, భాష్యం స్కూల్ ప్రిన్సిపల్,జయకృష్ణ పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

టంగుటూరు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం మహిళా అభివృద్ధికి చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని రమేష్ సంఘమిత్ర హాస్పెటల్ గైనకాలజిస్టు వైద్యులు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దీప కొనియాడారు. పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ జివికె.మూర్తి, అడ్మిషన్ డైరెక్టర్ ఆర్. వీరాంజనేయులు, ఎఒ ఎం.రమణబాబు, ప్లేస్‌మెంట్ డీన్ కె.రూప, డబ్ల్యుఇసి కన్వీనర్ ఎన్.వైష్ణవి, పాల్గొన్నారు.

శింగరాయకొండ : స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ సిఐ సతీమణి ఉమా, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, ప్రైమరీ ఇన్‌ఛార్జి అమరవేణి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి శంషాద్, అకాడమిక్ డీన్ శ్రీనివాసరావు, ఎఒ మధు, మహిళా సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముఠా యూనియన్ నాయకుడు రసూల్ మృతి

ప్రజాశక్తి-దర్శి

ముఠా యూనియన్ నాయకుడు మధీనారసూల్ మృతి ముఠా వర్కర్స్ యూనియన్‌కు తీరనిలోటు అని సిఐటియు దర్శి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని పొతకమూరు గ్రామానికి చెందిన మధీన రసూల్ మంగళవారం మృతిచెందాడు. ఆయన మృతదేహంపై సిఐటియు జెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు ప్రధాన కార్యదర్శి కోటంశెట్టి హనుమంతరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కల్లూరి చిన్నాంజనేయులు, సిపిఐ నియోజకవర్గ కమిటీ నాయకులు తన్నీరు వెంకటేశ్వర్లు, ముఠా సంఘం నాయకులు మిల్లర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

భక్తులతో సింగరకొండ కిటకిట

విద్యుత్ కాంతులతో ఆకట్టుకున్న ప్రభలు ● వైభవంగా స్వామివారి రథోత్సవం ● తిరునాళ్లలో పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి-అద్దంకి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండ క్షేత్రంలోని క్షేత్ర పాలకుడు లక్ష్మీనృసింహ స్వామి భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 68వ వార్షిక తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా ఆలయాల్లో భక్తులు ఉదయం 5 గంటల నుంచి తెల్లవారు జాము వరకు స్వామి వార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఉమ్మడి జిల్లాల ముఖ్యనేతలు, అధికారులు స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయాల చైర్మన్లు కోట శ్రీనివాస్ కుమార్, నర్రావుల కొండలు, కార్యనిర్వహణాధికారులు టి సుభద్ర, కోటిరెడ్డి, ధర్మకర్తల మండలి కార్యవర్గ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ గావించారు. ఆలయాల్లో భక్తులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని దాతల సహకారంతో దేవస్థానం ఆధ్వర్యంలో మజ్జిగ, మంచి నీళ్ల బాటిల్స్, వాటర్ ప్యాకెట్లు, ప్రసాదాలు అందజేశారు. సామాజిక అన్న సత్రాల్లో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 7.00 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని మాడ వీధుల్లో ప్రసన్నాంజనేయ స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా కేరళ డప్పు వాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. రాత్రి 9.00 గంటల నుంచి తెల్లవారు జాము వరకు వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై సినీ, టివి జూనియర్ ఆర్టిస్టులు, జబర్దస్త్ నటులచే ఇష్టమైన సినీ హీరోల చిత్రాల్లోని పాటలతో





విద్యుత్ కాంతులను వెదజల్లుతున్న ప్రభలు.. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వెంకటేష్

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు వేలాదిగా తరలివచ్చి విద్యుత్ ప్రభలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు. మొత్తం మీద తెలుగు దేశం పార్టీ యువ నాయకులు దామా సురేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రజలను బాగా ఆకట్టుకున్నది.

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పూజలు

సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వార్ల 68వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, యువ నాయకులు, వైసిపి చీరాల ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌బాబు, చీరాల పురపాలక సంఘం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మంగళవారం స్వామి వార్ల చెంతన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా క్షేత్ర పాలకుడు శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు కరణం కుటుంబ సభ్యులను ఆలయ చైర్మన్ కొండలు, ఈఒ కోటిరెడ్డి, పూజారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రతిష్ట, మూల విరాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. వారిని చైర్మన్ కొండలు శాలువాలతో సత్కరించి సన్మానించారు. అనంతరం ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఆలయ చైర్మన్ కోట శ్రీనివాస్ కుమార్, ఈఒ టి సుభద్ర, పూజారులు మర్యాదపూర్వకంగా ఘన స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణ, ధ్వజ స్తంభం, మూల విరాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. మర్యాద పూర్వకంగా ఆలయ చైర్మన్, ఈఒలు బలరాం, వెంకటేష్, శ్రీనివాసరావులను పట్టు వస్త్రాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనృసింహ స్వామి దేవస్థాన మాజీ చైర్మన్ జువ్వి రాము, దేవస్థాన ధర్మకర్తల మండలి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

ప్రజాశక్తి-పంగులూరు

కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంత మవుతున్నా అటు రెవెన్యూ అధికారులు గాని, ఇటు ప్రభుత్వం గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ల ఆక్రమించు కోవడం, ఆక్రమిం చుకున్న స్థలాన్ని అమ్ముకోవటం, అందులో నిర్మాణాలు చేసుకోవటం పరిపాటిగా మారిపోయింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ స్థలాన్ని, ప్రతినిత్యం ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు తిరుగుతున్నా ఆక్రమణదారులు మాత్రం నిర్భయంగా ఆక్రమించుకుంటున్నారు. అడిగేవారు ఎవరూ లేరని, ఎవరి ఇష్టం వచ్చినట్లు వారే వ్యవహరిస్తున్నారు. మండలంలోని కొండమంజులూరు సమీపంలో, జాతీయ రహదారి ఆనుకొని, పడమర వైపున ఉన్న సర్వే నెంబర్ 58లోని, రెండు ఎకరాల 42 సెంట్లు డొంక పోరంబోకు భూమి ఉంది. దీన్ని గతంలో కోనంకి డొంక అని పిలిచేవారు. జాతీయ రహదారి విస్తరించడంతో ఈ ప్రాంతంలో ఉన్న భూములకు రెక్కలు వచ్చాయి. స్థలాలకు ధరలు విపరీతంగా పెరగడంతో, ఎక్కడ సెంటు స్థలం దొరికినా దాన్ని కబ్జా చేయటం ఇక్కడ పరిపాటి అయింది. ఇందులో భాగంగానే సర్వే నెంబర్ 58లో ఉన్న రెండు ఎకరాల 42 సెంట్ల భూమి కూడా ఆక్రమణకు గురైంది. కొంతమంది ఈ భూమిలో ఇప్పటికే హోటళ్లు, టీ స్టాళ్లు నిర్మించుకోగా, మరికొంతమంది తమ సొంత ఆస్తి లాగా ఇష్టం వచ్చినట్లు అమ్ముకుంటున్నారు. కొంతమంది ఏకంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. సుమారు రూ.5 కోట్ల విలువచేసే ఈ భూమి, 20 సెంట్లు మినహాయించి మిగతా మొత్తం ఆక్రమణలకు గురైంది. ఈ విషయంపై గత రెండు నెలల క్రితం 'ఐదు కోట్ల భూమి ఆక్రమణ' పేరుతో 'ప్రజాశక్తి'లో వార్త వచ్చింది. ఆ సమయంలో కొంత హడావుడి చేసిన అధికారులు, మళ్లీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు ఆ ఆక్రమణల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ



ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

కాలంలో సుమారు పది సెంట్ల భూమిని, ఓ వ్యక్తి సొంత ఆస్తిలాగా అమ్ముకోగా, కొన్న వ్యక్తి అందులో ఇంటిని నిర్మించి, దాని చుట్టూ ఫెన్సింగ్ కూడా వేశాడు. మరోవ్యక్తి సుమారు 20 సెంట్ల భూమిలో కట్టడాన్ని నిర్మించేందుకు పని ప్రారంభించాడు. ఈ విధంగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు.

ఆక్రమణదారులందరికీ నోటీసులు ఇస్తాం: తహశీల్దారు పద్మావతి

జాతీయ రహదారి వెంబడి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న ప్రతి ఒక్కరికి నోటీసులు అందజేసి, ఆక్రమణలు తొలగిస్తామని, పంగులూరు మండల తహశీల్దారు పద్మావతి అన్నారు. మంగళ వారం మధ్యాహ్నం రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆమె ఆక్రమణ దారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, స్థలాన్ని సొంత భూమి లాగా ఆక్రమించుకొని, అమ్మకాలు జరుపుకోవడం, అక్రమంగా ఇల్లు నిర్మించుకోవటం చట్టరీత్యా నేరమని, ఆక్రమణదారులు తక్షణమే స్థలాలను ఖాళీచేసి వెళ్లాలని, ఆమె ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో హోటళ్లు, టీ స్టాళ్లు, ఇళ్లు నిర్మించుకున్న వారికి వెంటనే నోటీసులు ఇవ్వాలని కొండమంజులూరు విఆర్ఓ వెంకటేశ్వర్లుకు ఆదేశాలు జారీ చేశారు. నోటీసులు ఇచ్చినా ఖాళీ చేయని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహశీల్దారు పద్మావతి అన్నారు. ఆమె వెంట కొండమంజులూరు వీఆర్వో వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ వినోద్, కొండమంజులూరు గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు ఉన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-చీరాల



కళాశాల విద్యార్థులతో ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ శ్రీదేవి

ఉమెన్స్‌డే సెలబ్రేషన్స్ చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్సాహంగా జరిగాయి. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కళాశాలలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవ విశిష్టతను తెలిపే విధంగా డ్రాయింగ్ పోటీలను ఏర్పాటు చేశారు. అందులో మహిళల గొప్పదనం, త్యాగం, ధైర్యం తెలిపేలా విద్యార్థులు వేసిన చిత్రలేఖనాలు ఆకట్టుకున్నాయి. మహిళల గొప్పతనాన్ని చాటేలా చేసిన కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆలోచింపచేశాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానం కార్యక్రమంలో మానసిక వికాస నిపుణులు పెర్లి సందీప్ మాట్లాడుతూ ఒత్తిడి సహజమైన ఈ రోజుల్లో దానిని అధిగమించటం అలవాటు చేసుకోవాలన్నారు. మనకు మంచే జరుగుతుందని నమ్మకం ఉండాలి. నమ్మకం లేకపోవటంతో వలనే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. మన సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని, వీటికి దూరమై పాశ్చాత్య సంస్కతికి దగ్గరవుతున్నామని, అందుకే ఈ పరిస్థితి వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ మహిళ లేనిదే సమాజం లేదన్నారు. భారతీయ సమాజంలో మహిళకు ఎంతో గౌరవం ఉందన్నారు. ప్రతిరోజూ మహిళా దినోత్సవమేనన్నారు. ప్రతి విద్యార్థి అమ్మను గౌరవించలన్నారు.అపుడే సమాజం విలువలతో ఉంటుందన్నారు. ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళా ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఐఎంఎ కార్యదర్శి శ్రీకాంత్, సీఎస్ఇహెచ్ ఓడి సౌజన్య, గంగాభవాని, వివిధ విభాగాధిపతులు ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి స్థావరాలపై పోలీసుల దాడులు



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి-చీరాల: గంజాయి విక్రయాలపై వన్‌టౌన్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. కారంచేడు మండలం పేర్నమిట్టకు చెందిన కట్టా దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన కుంభా మాధవి నుంచి గంజాయి కొనుగోలు చేసి చీరాల చుట్టుపక్కల విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రాత్రి చీరాల మునిసిపల్ పరిధిలోని ఉజిలీపేట సమీపంలో విక్రయిస్తున్న అతనిపై దాడుల నిర్వహించి అతని వద్ద గల 2 కిలోల గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుర్గా ప్రసాద్, మాధవిలపై కేసు నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా రామకృష్ణాపురంలో భద్రాద్రి నాని అనే వ్యక్తి నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచనున్నట్లు సిఐ తెలిపారు. గంజాయిలో 100 గ్రాములు పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు సిఐ తెలిపారు.

వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ హైవేపై మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. శింగరాయకొండ హైవే ఎన్‌హెచ్-16 ఎమర్జెన్సీ లాండింగ్ కలికివాయ గ్రామం వద్ద తెల్లవారుజామున 5 గంటలకు రోడ్డు మార్గంలో లారీ ఆపి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో లారీ డ్రైవర్ సుబ్బయ్య(52) అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనిది తమిళనాడు రాష్ట్రం అని చెబుతున్నారు. సంఘటన స్థలానికి సింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమా, ఏఎస్ఐ బేగ్ చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. గుర్తు తెలియని వాహనం కోసం గాలిస్తున్నారు. కావలి, టంగుటూరు రెండు టోల్ గేటుల్లోని సీసీ కెమెరాల ఆధారంగా ఆ సమయంలో వచ్చిన లారీలపై దృష్టి పెట్టి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. తమిళనాడులోని సుబ్బయ్య బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిస్టు అభిమాని గాలి వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు



కమ్యూనిస్టు భావాలు కలిగి, సహ ఉద్యోగులకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను వివరిస్తూ కమ్యూనిస్టు సానుభూతిపరులుగా తీర్చిదిద్దిన గాలి వెంకటేశ్వర్లు(95) సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయన మృతి పట్ల సిపిఎం, సిపిఐ నాయకులు నివాళులర్పించారు. రైల్వేలో నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేసిన వెంకటేశ్వర్లు కమ్యూనిస్టు భావజాలంతో తుది శ్వాసవరకు పని చేశారని అన్నారు. నేటి తరానికి వెంకటేశ్వర్లు జీవితం ఆదర్శనీయమన్నారు. ఈయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలను కూడా కమ్యూనిస్టు భావజాలంతో పెంచారని కొనియాడారు. చివరి వరకు ప్రజాశక్తి దినపత్రికను చదివి అనుసరిస్తూ ఉండేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం సత్యనారాయణ, బి నాగమల్లేశ్వరరావు, చిట్టెయ్య, సిపిఐ నాయకులు జి బాలాజీ, బి శ్రీనివాసరావు, టిడిపి ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు తదితరులు ఉన్నారు.

వ్య.కా.స. ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

మండల కేంద్రం కొల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ బాల త్రిపుర సుందరిని మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి సుబ్బారావు మాట్లాడుతూ అవనిలో సగం, ఆకాశంలో సగం, అన్నింటిలో సగభాగంగా ఉన్న మహిళల పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షుగా మారిందన్నారు. నేడు ఆడపిల్లలకు ఆదరణ లేక ప్రతి 20 నిమిషాలకొక మానభంగం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ అవి బలిసినోళ్లకు చుట్టలుగా మరాయన్నారు. సమసమాజం కోసం మహిళలంతా ఏకమై సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివ సుబ్రహమాన్యం, లెక్చరర్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాలో 142 మంది ఎంపిక

ప్రజాశక్తి-చీరాల

స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా కళాశాలలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం (జెకెసి) ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్ మేళా జరిగింది. ఈ జాబ్ మేళాకు మొత్తం 310 మంది హాజరుకాగా 142 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రమణమ్మ తెలిపారు. అందులో భారత్ ఫియా లిమిటెడ్‌కు 51 మంది, జెడ్‌టిటి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 1, టాటా టొయెటా రేడియేటర్స్ కు ఆరుగురు, వేర్మిరెస్‌కు 13 మంది, ఎస్-ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ఇండియా లిమిటెడ్‌కు 10 మంది, డైకిన్ ఎయిర్ కండీషనర్ లిమిటెడ్‌కు 18 మంది, జోయాలుక్కాస్ జ్యువలరీకి 10 మంది, వసంత టెక్స్‌టైల్ లిమిటెడ్‌కు 12 మంది, అపెక్స్ సాఫ్ట్ సొల్యూషన్స్‌కు 9 మంది, స్కిల్ సోనిక్స్‌కు 12 మంది ఎంపిక అయ్యారని కళాశాల జెకెసి కోఆర్డినేటర్ సాయి ప్రసన్న తెలిపారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-బాపట్ల



ఏల్చూరి శ్రీలక్ష్మి

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ మహిళా ఉద్యోగుల్లో పని ఒత్తిడి పెరిగిందని బాపట్ల పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక అధికారి ఏల్చూరి శ్రీలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుచేసే ప్రక్రియలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో మహిళలే అధిక శాతం బాధ్యత వహించాల్సి ఉంటుంది. పలు ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది కొరత ఉంది. దీంతో పని భారం మరింత పెరిగింది. బాపట్ల పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్ లేకపోవడం మరింత పనిభారం పెరిగింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో మహిళలే ముందంజలో ఉన్నారు. అయినా మహిళలపై వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. విజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ భారతీయ సంస్కృతిని గౌరవించాల్సిన యువకులే యువతుల పట్ల వికృత చేష్టలకు పాల్పడుతూనే ఉన్నారు. మద్యం మత్తులో తల్లికి, ఇల్లాలికి తేడా తెలియకుండా పోతోంది. సమాజంలో ఈ విధమైన రుగ్మతలు రూపుమాపితేనే మహిళల ఆత్మగౌరవం మరింత పెరుగుతుంది. పురుషుల కంటే మహిళలకే పని భారం అధికం. కుటుంబ సంరక్షణ, పోషణ భారం, ఇటు ఉద్యోగ విధులతో మహిళలు మానసిక ఒత్తిడికి గురవుతూనే ఉన్నారు. ఒత్తిడి తగ్గించుకుని ప్రతి మహిళ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తమ బాధ్యతలను నిర్వర్తించాలి. మహిళలు ఆర్థిక స్వావలంబనతో తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందడుగు వేయాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి మహిళకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు.

పేద విద్యార్థులకు సాయమందిస్తున్నాం

ఆర్ మాధవి, బయాలజీ టీచర్, మున్సిపల్ హైస్కూలు, రేపల్లె

ప్రజాశక్తి-రేపల్లె



అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో పేద విద్యార్థులకు సాయమందిస్తున్నామని పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో బయాలజీ టీచర్ ఆర్ మాధవి తెలిపారు. తనతో పాటు పదో తరగతి చదివిన స్నేహితుల సహకారంతో ఆప్తమిత్ర సేవా సంస్థను స్థాపించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు సుమారు 5 లక్షల నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందించామన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.5 వేలు, మండలంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.10 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు.

పాలిటెక్నిక్ కాలేజీలలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పాలిటెక్నిక్ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంజి హైస్కూల్ హెచ్ఎం వై రమాదేవి, ఏబీవీ హైస్కూల్ ఉపాధ్యాయిని వై సత్యవతి, మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం బి రాజశ్రీని ఈ సందర్భంగా సన్మానించారు. బాలికలందరూ ఉన్నత చదువులు చదివి సమాజాభివృద్ధికి తోడ్పడాలని సన్మాన గ్రహీతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాపట్ల పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.



రాణిస్తున్న నారీమణులు

ఎస్ విజయమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, బాపట్ల

ప్రజాశక్తి-బాపట్ల

పురుషులకు ధీటుగా నారీమణులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ విజయమ్మ తెలిపారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. అయితే ఆడపిల్ల అంటే ప్రతి ఒక్కరూ చిన్నచూపు చూస్తున్నారు. గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలిస్తే రూపుమాపేందుకు సైతం వెనుకాడడం లేదు. కుటుంబాల్లో ఆయా పరిస్థితులు ఎదురైతే మహిళలు సరిదిద్దుకోవలసిన అవసరం ఉంది. ఎవరైనా తప్పు చేస్తే అది తప్పు అని ఖండించగలిగే స్థాయికి మహిళలు ఎదగాలి. పాఠశాలల్లో చదువుకునే బాలికల సంఖ్య పెరగాలి. డిగ్రీ వరకు ఆడపిల్లను చదివించగలిగితే సమాజంలో మహిళల పట్ల నెలకొని ఉన్న అభద్రతా భావాన్ని తొలగించేందుకు ఎంతో దోహదపడుతుంది. ప్రతి మహిళకు సమాజం అండగా నిలవాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దాదాపు అంతరించే దశకు చేరడం వల్లే మహిళలకు ఓదార్పు తగ్గింది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపగలిగితే కుటుంబం, సమాజ వ్యవస్థలో ఎన్నో మంచి మార్పులను చూడొచ్చు.

మహిళలపై వేధింపు నిరోధక కమిటీ ఏర్పాటు చేశాం



ఎస్ విజయమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, బాపట్ల

జిల్లాలో మహిళలపై జరుగుతున్న అనేక వేధింపులను నిరోధించేందుకు జిల్లాలో వేధింపు నిరోధక కమిటీని ఏర్పాటు చేశాం. బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మహిళ కావడంతో ఈ కమిటీని పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి జరుగుతోంది. అతివలు స్వతహాగా తమ హక్కుల సాధనకు నడుం కట్టిననాడే సమాజంలో అనుకున్న మార్పునకు శ్రీకారం చుట్టగలం. దానికి సమాజం సహకరించాలి. ప్రతి మహిళ ధైర్యంగా ముందడుగు వేయాలి. అప్పుడే మహాత్మాగాంధీ కన్న కలలకు సార్థకత చేకూరుతుంది.

బాల్యవివాహాల నిర్మూలనకు వివాహ రిజిస్ట్రేషన్ పద్ధతి

కులమతాలకు అతీతంగా ఏ సామాజిక వర్గమైనా వివాహానికి ముందే వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉంటేనే పెళ్లిళ్లు జరిగే విధంగా చట్టం చేస్తేనే బాల్యవివాహాలను నిర్మూలించగలం. బాల్య వివాహాలతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. చిన్న వయసులోనే ఆడపిల్లలు గర్భం దాల్చడం, పుట్టిన పిల్లలు అనేక రుగ్మతల బారిన పడడం జరుగుతోంది. దీంతో చిన్న వయసులోనే ఆడపిల్లలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని నిరోధించటానికి వివాహ రిజిస్ట్రేషన్ ఏకైక మార్గం.

జిల్లాలో మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

జిల్లాలో 43 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 12 అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా గ్రామీణ పట్టణ మహిళలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ఇంకా జిల్లాలో 14 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశాం. జిల్లాలో వీటి ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందించే వైద్య సేవలను సత్వరమే అందిస్తున్నాం. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ మహిళా కార్మికులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి సత్వరమే వైద్య సహాయం పొందాలని విజయమ్మ కోరారు. బాలికల సంరక్షణ వారి చదువుపట్ల మరింత శ్రద్ధ కనబరిచి సమాజ హితానికి, బాలికా సంరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని ఆమె పిలుపునిచ్చారు.

మహిళలు ప్రజా జీవనంలో ప్రత్యేక భూమిక

ప్రజాశక్తి-బాపట్ల



రంగిశెట్టి శివకామేశ్వరి, డిటిఏవో, బాపట్ల జిల్లా

సమాజంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ప్రజా జీవనంలో ప్రత్యేక భూమిక నిర్వహిస్తున్నారని బాపట్ల జిల్లా ట్రెజరీ మరియు అకౌంట్స్ అధికారి రంగిశెట్టి శివకామేశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. స్త్రీలు గతం కంటే విద్యావంతులు అవుతున్నారు. అదే చైతన్యంతో మహిళల సామర్థ్యాన్ని గుర్తింపును ఆశిస్తున్నారు. స్త్రీలు అనేక రంగాల్లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగింది. కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడంలో మహిళలు గురుతర బాధ్యత నిర్వహిస్తున్నారు. అయితే ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉంది. స్త్రీలు ఎన్నికష్టాలు, అసమానతలను ఎదుర్కొన్నారో గుర్తు చేస్తూనే పురుషులతో సమానంగానే గాక రెట్టింపు ప్రాధాన్యతను కల్పించి మహిళల్లో ప్రతి రంగంలోనూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా కృషి జరగాల్సిన అవసరం ఉంది. నారీ శక్తిని గుర్తిస్తేనే సమాజం మరో ముందడుగు వేస్తుందనడంలో సందేహం లేదు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల్లో అంతరాలను తగ్గించి సమాజంలో సమాన అవకాశాల కల్పన దిశగా కృషి జరగాలి. ఈ సందర్భంగా మహిళా లోకానికి 2023 యేడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవశుభాకాంక్షలు తెలియజేశారు.

పాల లారీ బోల్తా

ప్రజాశక్తి-తర్లుపాడు: మండలంలోని నాయుడుపల్లి కాలనీ వద్ద పాల లారీ మంగళవారం అదుపు తప్పి బోల్తా పడింది. సమాచారం అందుకున్న తాడివారిపల్లి ఎస్ఐ ముక్కంటి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగలేదని ఎస్ఐ తెలిపారు.

అండాశయ తిత్తులు.. చికిత్స..

ప్రజాశక్తి- ఒంగోలు

మహిళలలో పునరుత్పత్తి ప్రక్రియకు దోహదం చేసేవాటిలో అండాశయం ప్రధానమైంది. ఇది అండోత్సర్గానికి (రుతుక్రమం సందర్భంగా గుడ్ల విడుదల) సహకరిస్తుంది. అండాశయంలో చిన్న గ్రీవములు (ఫోలికల్స్) ఉంటాయి. అవి రుతుక్రమంలో పెరిగి గుడ్డు విడుదల కాగానే కరిగిపోతాయి. అండాశయంలోని ఫోలికల్ గుడ్డు విడుదల కాని పక్షంలో లేదా తర్వాత కరిగిపోవడం లేదా ఈ రెండూ ఏర్పడినపుడు అండాశయం తిత్తి రూపంలోకి మారుతుంది. తద్వారా ఫాలికల్ ద్రవం నిండిన బుడగగా మారడానికి ఉబ్బుతుంది. అండాశయ తిత్తులు మహిళలలో సామాన్యంగా ఉంటాయి. అవి లక్షణాలను చూపవచ్చు లేదా చూపకపోవచ్చు. దీర్ఘకాలం లక్షణాలు లేకుండా కూడా ఉండవచ్చు. ఈ స్థితికి సాధారణ చిహ్నాలు కడుపు క్రిందిభాగంలో నొప్పి కలగడం, రుతుక్రమం తప్పిపోవడం, ఉన్నదున్నట్లుగా బరువు పెరగడం. దీనికి హార్మోనుల అసమతౌల్యత ప్రధానమైన కారణంగా చెప్పవచ్చు. ఇతర కారణాలలో అంతర్లీనమైన గర్భాశయంలో గడ్డలు, ఎండోమెట్రియాసిస్ అనబడే గర్భాశయ లోపలి కణజాలంలో సాధారణంగా తరచూ ఏర్పడే బాధాకరమైన రుగ్మత వంటి ఆరోగ్య స్థితిగతులు. అవి ఒక మహిళలో అండాశయ తిత్తి పెరుగుదల సందర్భంగా నొప్పి కలిగించడానికి దారితీసుంది. ఈ తిత్తులను అల్ట్రా సౌండ్ స్కాన్ ద్వారా నిర్ధారిస్తారు. తద్వారా చికిత్స కొనసాగిస్తారు. అనేక సందర్భాలలో తిత్తి కొన్ని నెలలలో కరిగిపోతుంది. తర్వాత చికిత్స అవసరం ఉండదు. అయితే కొన్ని అరుదైన సందర్భాలలో ఈ తిత్తులు కేన్సర్‌కు దారితీయవచ్చు. అండాశయ తిత్తి చికిత్సలో గర్భనిరోధక మాత్రలు చేరి ఉంటాయి. ఇవి హార్మోన్ల సమతుల్యతను యథాస్థితికి తీసుకొని వస్తాయి. కొన్ని సందర్భాలలో తిత్తిని శస్త్రచికిత్స ద్వారా తొలగించాల్సి వస్తుంది. తిత్తులకు చికిత్స చేయకుండా వదిలివేస్తే అవి వంధ్యత్వానికి దారితీస్తాయి.

ఒవేరియన్ సిస్టైవస్‌టి లక్షణాలు

తిత్తుల పనితీరుకు సంబంధించి అవి ఎలాంటి లక్షణాలనూ చూపవు. రోగనిర్ధారణ తిత్తులలో కొన్ని సాధారణ లక్షణాలు ఇలా ఉంటాయి.

- పొత్తికడుపులో తీవ్రమైన లేదా తేలికపాటి నొప్పి
- కడుపు ఉబ్బరం, వికారం.
- ఆకలి తగ్గడం, మలబద్ధకం



డాక్టర్ నల్లూరి అరుణారావు

- క్రమం లేనట్టి రుతుక్రమం
- పొత్తికడుపులో వాపు

అండాశయతిత్తికి సాధారణమైన చిన్నపాటి మరియు తక్కువగా కనిపించే లక్షణాలు

- కటి భాగంలో నొప్పి, లైంగిక చర్య సందర్భంలో నొప్పి
- వివరణకు అతీతమైన యోనిలో రక్తస్రావం
- స్తనములలో తేలికపాటి లేదా చాలా తక్కువ స్థాయిలో నొప్పి, తరచుగా మూత్రవిసర్జన
- తొడల వద్ద మరియు వీపు క్రింది భాగంలో నొప్పి
- ఉన్న పళంగా బరువు పెరగడం. ఎక్కువ మంది మహిళలలో అండాశయ తిత్తి కారణంగా సంతానోత్పత్తి ప్రక్రియ సక్రమంగా ఉన్నప్పటికీ, కొందరు స్త్రీలు గర్భం దాల్చడంలో విఫలమవుతారు.

ఒవేరియన్ సిస్టైవస్‌టి చికిత్స

- అనేక సందర్భాలలో అండాశయ తిత్తి ఎలాంటి చికిత్స లేకుండా కొన్ని నెలలలో కరిగిపోతుంది.. అలాంటి సందర్భాలలో లక్షణాలను గమనించే అవసరం ఉండదు.

తిత్తి పరిమాణం..అది కల్పించే లక్షణాలు

- మహిళకు రుతుక్రమం నిలిచిపోవడం
- కొంతకాలం పాటు తిత్తులను పరిశీలనలో ఉంచడం
- కొన్ని సందర్భాలలో డాక్టరు మీకు వెంటనే చికిత్స అవసరం లేదని సిఫార్సు చేసి, వైద్యపరీక్షలు కొనసాగించవచ్చు. అవి అల్ట్రాసౌండ్స్ మరియు తిత్తి నయమవుతున్నదా అని పరీక్ష వంటివి. రుతుక్రమం (మేనోపాజ్) ఆగిపోయిన సమయంలో కనీసం ఏడాది పాటు ప్రతి నాలుగు నెలలకు ఒకమారు అల్ట్రాసౌండ్ స్కాన్ జరిపించు కోవాలని సూచించవచ్చు. ఎందుకంటే అట్టి రోగులలో అండాశయం కేన్సర్ ప్రబలే ప్రమాదం పొంచి ఉంటుంది. ఆ పరీక్షలలో తిత్తి లేదని తెలిస్తే తదుపరి చికిత్స అవసరం ఉండదు.

ఔషధాలతో చికిత్స

ఆరోగ్య పరిరక్షణకర్త అండోత్సర్గం (ఓవులేషన్) నిలవడానికి హార్మోన్లతో కూడిన (గర్భనిరోధక మాత్రలతో కూడినది) ఔషధాలను సూచించవచ్చు. ఈ ప్రక్రియ క్రియాత్మకమైన తిత్తిఏర్పడటాన్ని నిలుపుతుంది.

శస్త్ర చికిత్స

నొప్పి మరియు మంట లేదా వాపునకు దారితీసే లక్షణాలు కలిగిన పెద్ద పరిమాణం తిత్తులను శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చు. ఈ శస్త్రచికిత్స రెండు విభిన్న రకాలలో చేపట్టవచ్చు.

లిప్రొస్కోపీ

కేన్సర్‌కు దారితీయనట్టి తిత్తులకు లాప్రొస్కోపిక్ శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. ఈ శస్త్రచికిత్స (సర్జరీ) లో డాక్టరు బొడ్డువద్ద చిన్న కోత జరిపి తద్వారా ఒక సాధనాన్ని లోనికి చొప్పించి తిత్తిని వెలుపలకు తీస్తారు.

లిలపటోరమీ

పెద్ద పరిమాణం కలిగి మరియు కేన్సరుకు దారితీసే తిత్తిని తొలగించడానికి ఉపయోగించే ప్రక్రియను లాపటోరమీ అంటారు. ఈ శస్త్రచికిత్స తిత్తిని తొలగిమ్పి దానిని తదుపరి పరీక్షకు పంపడానికి డాక్టరుకు వీలు కలిగిస్తుంది. తిత్తి కేన్సరుకు దారితీసేదయితే కేన్సర్ నిపుణుడు (ఆంకాలజిస్ట్) తదుపరి చికిత్స నిర్వహిస్తాడు. దాని తీవ్రతను బట్టి అండాశయాన్ని తొలగించాల్సి వస్తుంది.

శస్త్రచికిత్స తర్వాత రోగికి పొత్తికడుపులో కొద్దిపాటి అసౌకర్యం, నొప్పి కలుగవచ్చు. శస్త్రచికిత్స వల్ల ఎదురవుతున్న నొప్పి కొద్దిరోజులలో నయమవుతుంది లాపరోస్కోపీ తర్వాత చికిత్స పొందిన వ్యక్తి రెండు వారాలలో, లాపరోటమీ తర్వాత ఎనిమిది వారాలలో కోలుకుంటారు.

43 ఏళ్ల అనుభవం

గైనకాలజిస్టుగా నల్లూరి అరుణారావుకు 43 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ఇప్పటి వరకు ఆమె 15 వేలకు పైగా డెలివరీలు, 20 వేలకు పైగా ఆపరేషన్లు నిర్వహించారు.

- డాక్టర్ నల్లూరి అరుణారావు
సీనియర్ గైనకాలజిస్ట్,
నల్లూరి నర్సింగ్‌హోం, ఒంగోలు

ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న జివి. కొండారెడ్డి

ప్రభుత్వ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో తంబి శ్రీనివాసులు అధ్యక్షతన ఒంగోలు నియోజక వర్గ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జివి కొండారెడ్డి మాట్లాడుతూ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా ఉద్యోగులపై కక్ష కట్టిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐఆర్ కంటే ఫిట్‌మెంట్ తగ్గించినట్లు తెలిపారు. హెచ్‌ఆర్‌ఎలో కోత పెట్టిందన్నారు. ప్రతినెల మొదటివారంలో జీతాలు పించన్లు ఇచ్చే సంస్కృతి లేదన్నారు. కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయడం లేదని, అవుట్సోర్సింగ్ సిబ్బందికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని తెలిపారు స్కీం వర్కర్లను యాప్‌ల పేరుతో మానసికంగా భయపెడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నగరర కార్యదర్శి జి. రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. రమాదేవి, దామా శ్రీనివాసులు, సిపిఎం కొత్తపట్నం మండల కార్యదర్శి ఎస్. స్వామి రెడ్డి పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలు కొనసాగించాలి : మేయర్

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

సామాజిక నిర్మాణానికి జీవితాలను త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను కొనసాగించాలని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. స్థానిక మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనంలో కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ దళితులకు చట్టసభలో ప్రవేశం కోసం ఉద్యమం చేసినట్లు తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలే మహిళలకు విద్య నేర్పించడంలో చాలా సహాయం చేశారన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా నాటికలు, నాటకాల ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత పడమటిగాలి ఫేమ్ ఆనందరావు, బీసీ సంఘాల అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ప్రముఖ పౌరాణిక రంగస్థలనటులు కనుమల రాఘవులు, అంగలకుర్తి ప్రసాద్, వేలూరి శ్రీనివాసరావు , గేరా అజయ్ బాబు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి- కంభంరూరల్

ప్రజల పక్షాన పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలనియుటిఎఫ్, సిఐటియు నాయకులు కోరారు. మదారుపల్లె, నర్సిరెడ్డి పల్లె, ఎర్రబాలెం గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తే శాసన మండలిలో ప్రజల పక్షాన మాట్లాడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కోలా సునీల్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు సాయిబాబా,సిఐటియు నాయకుడు తోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు **మార్కాపురం రూరల్ :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఎపి రైతు సంఘం పశ్చిమ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలిలో నిరుద్యోగులు, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్, ఉపాధ్యాయ, కార్మిక వర్గ, ప్రయివేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయుల తరపున ప్రశ్నించేందుకు పిడిఎఫ్ తరపున



కంభంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొగ్గు రామిరెడ్డి, షేక్ నబీరసూల్, వెంకటేశ్వరరెడ్డి, బాబు పాల్గొన్నారు. **అర్ధవీడు :** ప్రజల పక్షాన పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. మండల పరిధిలోని పాపినేనిపల్లె, అర్ధవీడు, బొల్లుపల్లి, అచ్చంపేట, అంకభూపాలెం గ్రామాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్యే అభ్యర్థి పి.బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.చలమారెడ్డి, ఎ.తిరుపతిరెడ్డి, రాజారావు, అయూబ్, నారాయణ, నారాయణరెడ్డి, రామిరెడ్డి, పరమేశ్వరరెడ్డి విశ్రాంత ఉపాధ్యాయులు బీరం రంగారెడ్డి, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **టంగుటూరు :** అన్ని వర్గాల ప్రజా పోరాటాలకు ముందుండి పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేశపోగు మోజెస్ కోరారు. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ స్థానిక అరుంధతినగర్‌లో నాయకులు ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ప్రవీణ్, కొల్లాబత్తిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యావంతులకు కొలువుల అడ్డాగా నిలుస్తుందని ఎంఇఒ ఆంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని కొలుకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులు, మంత్రి సురేష్‌కి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మండలంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 5,000 నగదు బహుమతి అందజేసి మంత్రి సురేష్ చేతుల మీదుగా సన్మానిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నత్యాలు, నాటికలు, ఏక పాత్రలు, వివిధ సాంస్కతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలు నాయక్, దినేష్ కుమార్, సర్పంచి రాజయ్య, మాజీ సర్పంచి అప్పారావు, ఎస్ఎంసి చైర్మన్ ఆవుల రాజు, ఉపాధ్యాయులు నెహేమియా, ప్రభాకర్, రాములు నాయక్, అశోక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లు వేయాలి : సర్పంచి

ప్రజాశక్తి-పిసిపల్లి

ఉపాధి నిధులతో గ్రామాల్లో అంతర్గత రోడ్లు, పొలాలకు వెళ్ళేందు రహదారులు నిర్మించాలని చెటగోగులపల్లి సర్పంచి ఎస్‌కె.నసీబా డిమాండ్ చేశారు. ఎంపిపి అత్తాల జఫన్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి నసీబా మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్లు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎంపిపి అత్తాల జఫన్య మాట్లాడుతూ ప్రతి శనివారం కనిగిరి డిపో నుంచి పిసిపల్లి, లక్ష్మక్కపల్లి మీదుగా మాలకొండ వరకూ బస్సును ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి లక్ష్మీకాంతం, మురుగమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్, వైస్‌ఎంపిపి రామక్రిష్ణ, ఎంపిడిఒ డివి.రమణారెడ్డి, డిప్యూటీ తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎఇ తిరుపాలయ్య, విద్యుత్ ఎఇ లక్ష్మీరాజేష్, ఎఒ జి.వెంకటస్వామి, ఐఇఆర్‌డి డి.నాగమల్లేశ్వరి, ఎపిఒ గడ్డం రాంబాబు, ఎంపిటిసిలు, సర్పంచులు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక కష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ రాజు సంగాని మాట్లాడుతూ . గత ఎనిమిది సంవత్సరాల నుండి కష్ణవేణి టాలెంట్ స్కూల్లో చదువుతూ ఈ సంవత్సరం పదో తరగతి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని కాలేజీలో అడుగుపెడుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ మేనేజర్ శ్రీధర్ . గుప్తాబిడియం రామకష్ణ, మాచర్ల కష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ హనుమంతరావు, కష్ణవేణి టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, హరిశ్చంద్ర, డాక్టర్ శివ, శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ షరీఫ్, స్కూల్ ఇన్‌ఛార్జి అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. **పొదిలి :** బాలికలు అన్నిరంగాలలో రాణించాలని ఎంఇఒ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలనారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. ఈ సందర్భంగా క్లాసికల్ డ్యాన్స్ విభాగంలో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థిని తేజస్వినికి కరిముల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు హబీబుల్లాబేగ్ రూ.1,116 నగదు బహుమతిని అందచేశారు.ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు రాఘవరావు, ఉద్యోగుల సంఘం నాయకుడు మూసా జానీ, మర్రిపూడి ఎంఇఒ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య, బివిరెడ్డి, చంద్రశేఖర్, విశ్రాంత ప్రధానో పాధ్యాయురాలు దోర్నాల వరలక్ష్మమ్మ పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగాన్ని కట్టడి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

పాలకపార్టీ ప్రజాప్రతినిధులు శాసనమండలి ఎన్నికలలో రక రకాలుగా ఓటర్లను, ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తుందని, వాటిని కట్టడి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జివి.కొండారెడ్డి తెలిపారు. ఊసా వెంకటేశ్వర్లు అధ్యక్షతన కనిగిరి నియోజకవర్గ స్థాయి సిపిఎం సమావేశం సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జివి.కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. వారు తమ నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తుంటే ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ప్రతినిధులు అధికార దుర్వినియోగానికి పాల్పడి ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రకరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళి అధికార పార్టీకి ఓట్లు వేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తమకు అనుకూలంగా వ్యవహరించాలని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలను ఖాతర్ చేయకుండా వార్డు, గ్రామ వాలంటీర్ల ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు పిసి.కేశవరావు, పిల్లి తిప్పారెడ్డి, బడుగు వెంకటేశ్వర్లు, కెవి.మాల్యాద్రి, రాయల మాలకొండయ్యపాల్గొన్నారు.

వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడిగా రాములు నాయక్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడిగా పి.రాములు నాయక్ నియమితులయ్యారు. రాములు నాయక్‌ది యర్రగొండపాలెం మేజర్ పంచాయితీ పరిధిలోని చెర్లోపల్లి తాండా. ఆయన వైసిపి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉంటున్నారు. ఎంపిటిసిగా పోటీ చేసి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులు అయిన సందర్భంగా రాములు నాయక్‌కు ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి, వైసిపి సోషల్ మీడియా నియోజక వర్గ కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా తదితరులు అభినందించారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

ప్రజాశక్తి -దర్శి

విద్యార్థులు గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని డిఎస్‌పి వి. నారాయణస్వామిరెడ్డి తెలిపారు. స్థానిక గౌతమి కాలేజిలో డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా సంకల్పం అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ, గౌతమి విద్యాసంస్థల అధినేత గుండారెడ్డి, ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, గౌతమి, లయోలా కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** యువత మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కావద్దని సిఐ మారుతీకృష్ణ తెలిపారు. స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి కోటయ్య, సచివాలయం–2 మహిళా పోలీస్ రాధాదేవి, కష్ణవేణి టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్ :** గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిఐ ఎం.భీమానాయక్ కోరారు. పట్టణంలోని పలు పాఠశాలలో గంజాయి, డ్రగ్స్



దర్శిలో మాట్లాడుతున్న డిఎస్‌పి

వినియోగం దుష్పరిణామాలు అనే అంశంపై సంకల్పం (డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం) పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ ఎం. సువర్ణ, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీసాయిబాలజీ హైస్కూల్ కరస్పాడెంట్ పి.ప్రకాశ్‌రావు, ప్రిన్సిపల్ మస్తాన్‌వలి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, మహిళ పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి

ఒంగోలు కలెక్టరేట్ : లింగవివక్షను రూపుమాపి ఆడపిల్లలు అన్ని రంగాలలో సాధికారత సాధించేలా అంగన్‌వాడీ కేంద్రం నుంచే పునాదులు వేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగడంలో బాల్యంలో వారి ఆరోగ్యం పట్ల మనం చూపే శ్రద్ధే కీలకమన్నారు కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళా వందనం, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావాలి

ఒంగోలు కలెక్టరేట్ : పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావాలని కలెక్టర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. పివిఆర్ బాలుర పాఠశాల, ఎపికెకె ఇంటర్మీడియట్ విద్యార్థులతో మంగళవారం ప్రత్యేకంగా మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలంటే భయపడవద్దని, ప్రశ్నలు ఏవిధంగా అడిగినా సమాధానాలు రాసేలా సబ్జెక్టు అర్థం చేసుకుని సన్నద్ధం కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, తహశీల్దారు మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.5వేల ఆర్థిక సాయం అందజేత


కొమరోలు : మండల పరిధిలోని సర్వెరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మైలగాని సుబ్బయ్య గత నెల 17న బైకు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. చికిత్స నిమిత్తం నగదు లేకపోవటంతో కుటుంబ సభ్యులు దాతల సహకారం కోరారు. అందులో భాగంగా టిడిపి మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ బాధిత కుటుంబానికి మంగళవారం రూ.5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల తిరుపతయ్య, మొగదాల రమేష్, బాలరాజు, తిరుపతి పాల్గొన్నారు.

పారిశ్రామిక సంస్థల ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు : వరికూటి

శింగరాయకొండ : రాష్ట్రంలో పారిశ్రామిక సంస్థలు నెలకొల్పడం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన సమ్మిట్ -23 విజయవంతమైన సందర్భంగా మంగళవారం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కట్టా శోభారాణి , వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి, యనమల మాధవి, షేక్ పటేల్. సలీం భాషా, ఎస్‌కె.సలీం , షేక్ అల్లావుద్దీన్ , సుబ్బారెడ్డి దాదా , తన్నీరు సుబ్బారావు పాల్గొన్నారు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో..

బోగస్ ఓట్లు



			మూలగుంటపాడు				
197	JANARDHAN REDDYvunnam జనార్ధన్ రెడ్డివున్నాం	SRINIVASULA REDDYvunnam శ్రీనివాసుల రెడ్యున్నా	0, vidhayanadari street, VIDHAYANADARI 0, విద్యనదారి స్ట్రీట్, విద్యనదారి	amrutha degree college	01/05/1970	M	
198	PADMAVATHITiru nagaru పద్మావతితిరునగరు	SESHU BABUKesavamatam శేషుబాబుకేశవమఠం	G-6 Sai APARTME, Vidya agar 6th lane, MULAGUNTAPADU G-6 Sai APARTME, విద్యానగర్ 6వ వీధి, మూలగుంటపాడు	Dr br ambedkar guru kulam girls singarayakonda	01/06/1965	F	

- వైసీపీ నేతకు చెందిన విద్యాసంస్థలో 30 ఓట్లు
- ఓట్ల చేర్పులో అధికారపార్టీ నేతల అక్రమాలు
- క్లాసులు బోధించని కళాశాలలో ఉపాధ్యాయ ఓటర్లు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున బోగస్ ఓట్లు వెలుగు చూశాయి. శాసన మండల ఎన్నికల్లో పీఠం దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఈ నెల 13న జరగనున్న శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నాయి. పట్టభద్రుల ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలకు మరిచిపోకముందే ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలో కూడా అక్రమాలు చోటు చేసుకోవడం విచారకరం. గతంలో ప్రభుత్వ విద్యాసంస్థల ఉపాధ్యాయులకు మాత్రమే ఓటు హక్కు ఉండగా ఈ విడత ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేసున్న ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించడం విశేషం. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వారు నిర్దిష్ట నమూనాలో సర్వీసు సర్టిఫికెట్లు ఓటు దరఖాస్తుకు జతపరచి ఓటు నమోదుకు దాఖలు చేయవలసి ఉంది. దీనిని అవకాశంగా తీసుకుని శింగరాయకొండలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వైసీపీ మద్దతుదారుడికి చెందిన ఒక డిగ్రీ కళాశాలలో ఏకంగా 37 ఓట్లకు దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసిన వాటిలో రెండింటిని తొలగించి 35 ఓట్లు అర్హులుగా నమోదు చేశారు. వాస్తవంగా ఈ కళాశాలలో కేవలం పదిమంది మాత్రమే ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నట్లు సమాచారం ఉంది. వీరిలో ఐదుగురికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తూ ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేయడం గమనార్హం. కాగా వీరిలో స్థానికంగా ఒక ప్రైవేటు వ్యక్తికి ఉపాధ్యాయ ఓటు కల్పించడం గమనార్హం. జాబితాలో నమోదైన 30 ఓట్లకు సంబంధించి ఓటర్లు ఎవరు అనేది ఓటరు స్లిప్పులు అందించే సిబ్బందికి, స్థానికులకు తెలియకపోవడం విశేషం. స్థానికంగా పనిచేస్తున్న ఐదుగురిలో నలుగురు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరికి బూత్ ఏర్పాటు చేయగా మిగిలిన వారికి ప్రకాశం జిల్లాతో పాటు బాపట్ల, నెల్లూరు జిల్లాలో బూత్‌లు కేటాయించటం గమనార్హం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 9 మందికి, టంగుటూరులో ఒకరికి, ఒంగోలు రెండు బూత్‌లలో 8 మందికి కేటా యించగా బాపట్ల జిల్లాకు సంబంధించి మార్టూరు, మేదర మెట్ల ఒకరు చొప్పున, చీరాలలో ఇద్దరికీ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదయ్యాయి. జిల్లాలోని సుదూర ప్రాంతంలో ఉన్న బేస్తవారిపేట, కనిగిరి, మార్కాపురం కేంద్రాల్లో ఒక్కొక్కరు, దర్శిలో ఇద్దరు, గిద్దలూరులో ముగ్గురు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యారు. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా లింగసముద్రం, కావలి, చిల్లకూరులలో ఒక్కొక్కరు చొప్పున, కోవూరులో ఇద్దరు చొప్పున ఓటర్ల జాబితాలో ఓట్లు నమోదు వెనుక ఎవరి హస్తం ఉన్నదనేది ఉపాధ్యాయులు మేధావుల్లో తీవ్రమైన చర్చ రేపుతోంది. కాగా గత కొంతకాలంగా తరగతులు నిర్వహించని విద్యాసంస్థల్లో సైతం ఉపాధ్యాయ ఓట్లు నమోదు చేయడం వెనుక పలు అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు 2019 నవంబర్ 1 నుంచి 31 అక్టోబర్ 2022 వరకు మూడేళ్ల పాటు సర్వీస్‌లో ఉన్నట్టు సర్వీసు ధ్రువీకరణ పత్రం జత చేయాలి. సర్వీసు సర్టిఫికెట్‌తో జతచేసిన ఓటు దరఖాస్తును సంబంధిత మండల విద్యాధికారి పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిర్ధారించుకున్న అనంతరం ఓటు జారీ చేయవలసి ఉంది. ఇక్కడ ఆ ప్రక్రియ సవ్యంగా జరిగిందా లేదా అన్నది అధికారులు తేల్చవలసి ఉంది. వాస్తవంగా ఒకే విద్యా సంస్థకు చెందిన 30 మంది ఉపాధ్యాయులు ఎవరు ఎక్కడ నివాసం ఉంటున్నారు? ఈ సంస్థలో ఎప్పటి నుంచి పని చేస్తున్నారు అనే విషయం నిర్ధారించవలసి ఉంది. ఈ 30 మంది ఏ ప్రాతిపదికన విద్యాసంస్థలో నియమించబడ్డారో తేల్చవలసి ఉంది. వాస్తవంగా ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు సంబంధించి జిల్లా విద్యాధికారి కళా శాలలకు సంబంధించి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఉపాధ్యాయుల సర్వీసులు నిర్ధారించవలసింది. కొండపి నియోజకవర్గ పరిధిలో సుమారు 100కు పైగా బోగస్ ఓట్లు నమోదు అయినట్లు సమాచారం ఉంది. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

25		RAMA SUBBA REDDY	ABC & GVR GOVT JR COLLEGE	SINGARAYAKONDA	KO
		VIJAYA BHASKARGURRA LA	AMRUTHA DEGREE COLLEGE	SINGARAYAKONDA	KO
		SYAMUsingothu	AMRUTHA DEGREE COLLEGE	SINGARAYAKONDA	KO

		MOULALISHAIK	AMRUTHA DEGREE COLLEGE	SINGARAYAKONDA	KO
		MAHAMMADRAP	AMRUTHA DEGREE COLLEGE	SINGARAYAKONDA	KO
26		AMRUTHA LAKSHMI	AMRUTHA DEGREE COLLEGE	SINGARAYAKONDA	KO

పోరాడే అభ్యర్థులను గెలిపించుకుందాం

ప్రజాశక్తి-చీరాల

ఉద్యోగ, కార్మిక, ప్రజా పోరాటాలకు అండగా నిలబడుతూ సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో చీరాల బ్రాంచ్ ఐఎల్టిడి ఫెడరేషన్ కార్మికుల సమావేశం ఫెడరేన్ అధ్యక్షుడు బి పోతురాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు, నిరుద్యోగులు, కూలీలు, రైతుల సమస్యలపై చట్టసభల్లో మాట్లాడే అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఉద్యమాలు ముందుకు వెళతాయని అన్నారు. ఆంధ్రరాష్ట్రంలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరఫున గెలిచిన ఎమ్మెల్సీలు నిజాయితీగా అనేక ప్రజా సమస్యల్లో భాగస్వామ్యం అవటంతో పాటు, రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హోదా ఇవ్వాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించి, జాబ్ క్యాలెండర్ ప్రకారం జాబ్‌లు ఇవ్వాలని, వ్యవసాయ కూలీ, రైతాంగ సమస్యలు, ప్రజలపై పడుతున్న ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, ఇతర అధిక ధరలను తగ్గించాలని చట్టసభల్లో నిలదీస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ పథకాల్లో పనిచేస్తున్న స్కీము వర్కర్స్, పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతరం ఉద్యోగ, కార్మికుల పోరాటాల్లో భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ఈనెల 13న జరగబోయే తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్, జిల్లా నాయకులు ఎన్ బాబూరావు, ఐఎల్‌టిడి ఫెడరేషన్ చీరాల బ్రాంచ్ కార్యదర్శి జి.సుధీర్, అధ్యక్షుడు బి పోతురాజు, ఫెడరేషన్ నాయకులు పి ఖాలేషా, సుధాకర్, శివరాజ్, సురేంద్ర, ఇమ్మానుయేలు, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.





చీరాలలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు, పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని మేదరమెట్లలో ప్రజాసంఘాల ప్రచారం

పంగులూరు: నిరంతరం ప్రజా సమస్యలపైనే పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను, శాసనమండలికి పంపిస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన మీగడ వెంకటేశ్వరరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. మంగళవారం సాయంత్రం మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఓటర్లను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు మాట్లాడుతూ, శాసనమండలిలో సమస్యలను ప్రస్తావించేది, పోరాడేది పిడిఎఫ్ సభ్యులేనని అన్నారు. గత 15 సంవత్సరాలుగా శాసనమండలిలో అనేక సమస్యలను ప్రస్తావించి పోరాటం చేశారని, పోరాట పటిమ కలిగిన వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. పెద్దల సభగా పేరొందిన శాసనమండలికి మేధావులను, విజ్ఞానవంతులను పంపాలని కోరారు. తూర్పు రాయలసీమ నియోజకవర్గం నియోజవర్గంలో రోజురోజుకీ పిడిఎఫ్ అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి పట్ల సానుకూలత పెరుగుతోందని, అందరూ ప్రోత్సహించి వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి రవికుమార్, వేమూరి షడ్రక్, పి ప్రేమ్ కుమార్, పి యెహెూషువ, మల్లె ప్రసాద్, వి నాగరాజు, వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: రాష్ట్రంలో ఉన్న సమస్యలను గుర్తించి శాసనమండలిలో మాట్లాడాలి అంటే పిడిఎఫ్ అభ్యర్థులను తప్పనిసరిగా గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని రాచపూడి గ్రామంలో కరపత్రాలు పంచుతూ ఓటర్లను కలిశారు. ఈ నెల 13వ తేదీన శాసనమండలికి జరిగే ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థి అయిన మీగడ వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎం ఆంజనేయులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ బాధ్యులు కేపి రాజు, కెవిపిఎస్ బాధ్యులు కంచర్ల సురేష్ బాబు పాల్గొన్నారు.



పంగులూరు ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మండలి ఎన్నికల్లో దొంగఓట్లు నివారించాలి

జిల్లా అధికారులకు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న శాసనమండలి ఎన్నికల్లో దొంగ ఓట్లు నివారించేందుకు ప్రభుత్వ అధికారులు అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బిసిహెచ్ ఓబులేసుకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో మంగళవారం శాసనమండలికి సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటరు లిస్టులో అనేకమంది ఓటర్లు కాని వారికి ఓటర్ లిస్టులో చోటు లభించిందని ఆధారాలతో సహా వివరించారు. కొండపి నియోజకవర్గంలో సింగరాయకొండ మండలంలో ఉపాధ్యాయ ఓటరులిస్టుకు సంబంధించి మూడు ప్రైవేటు విద్యాసంస్థలలో చాలా కాలం క్రితం పనిచేసి ఉపాధ్యాయ వృత్తి మానుకొని వేరువేరు వృత్తుల్లో ఉన్నవారికి నేడు ఉపాధ్యాయులుగా ఓటు అవకాశం కల్పించారని తెలిపారు. ఓటర్ లిస్టులోని వారి పేర్లు వివరాలతో సహా డిఆర్ఒకు ఇచ్చిన అర్జీలో వివరించారు. ఇలా అనర్హులకు ఓటు హక్కు కల్పించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్జీని పరిశీలించిన డిఆర్ఒ అవకతవకలు అక్రమాలు ఎక్కడ జరిగినా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని, ఇదే అర్జీని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి కూడా పంపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి బాలకోటయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఆరె నరశింహారావు, నాగలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం అందిస్తున్న ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఇంకొల్లు ఎన్ఆర్అండ్‌విఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. దాతల కుటుంబ సభ్యులు ఆరె గంగా భవాని, ఎ పద్మజ, జ్వాలా హాజరై ప్రతిభ కలిగిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. ఆరో తరగతిలో టి నాగచరిత, పి చిన్నబుజ్జి, ఏడో తరగతిలో షేక్ అఫ్రీన్, ఐ ప్రసన్న, 8వ తరగతిలో పి సిరిచందన, షేక్ సోఫియా, 9వ తరగతిలో బి కుసుమ, వై అమృత, పదో తరగతిలో వి వర్ధిని, ఎస్ మాధురిలకు ప్రథమ బహుమతిగా రూ.1,000, ద్వితీయ బహుమతిగా రూ.600 నగదు అందించారు. సభకు ప్రధానోపాధ్యాయిని వి ఉదయకుమారి అధ్యక్షత వహించారు.



చలివేంద్రంలో మజ్జిగ అందజేస్తున్న సాల్మన్ రాజ్

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు(వేమూరు)

వేమూరు మండలం యడవురు అడ్డ రోడ్డులో మంగళవారం గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సంస్థ అధ్యక్షులు కైతేపల్లి సాల్మన్‌రాజ్ ప్రారంభించారు. జంపని నుంచి తెనాలి వెళ్లే మార్గంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో వేమూరు నియోజకవర్గంలో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాల్మన్‌రాజ్ తెలిపారు. ఇటీవల కొల్లూరులో ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో గ్రేస్ ఫౌండేషన్ ఉచిత శిబిరం నిర్వహించి పేద ప్రజలకు అవసరమైన మందులు, చికిత్సలు అందించినట్లు తెలిపారు. చుండూరు మండలం అలపాడు గ్రామంలో ఈ నెల 9వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రేస్ ఫౌండేషన్ పేద ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు నడవటం అభినందనీయమని తోకలవానిపాలెం గ్రామ సర్పంచ్ టి కృష్ణమోహన్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు యన్నం సురేష్, యల్లమాటి దాసు, వంపుగాని గురవయ్య తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా 'సంకల్పం'

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రకాశం, బాపట్ల జిల్లాలను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాలుగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ మరియు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సంయుక్తంగా 'సంకల్పం- డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాటం' అనే నూతన అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా విద్యాసంస్థల్లో వేళ్లూనుకు పోతున్న మాదకద్రవ్యాల నిర్మూలినే లక్ష్యంగా బుధవారం ఒంగోలు లోని క్విజ్ కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, చట్ట పరమైన చర్యలు, శిక్షలు, డ్రగ్స్ వ్యసనం నుంచి ఎలా బయటపడాలి.. తదిర అంశాల పట్ల వినూత్నంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థుల విజయంతోనే

ప్రజాసమస్యలు పరిష్కారం

ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-కనిగిరి

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థుల విజయంతోనే ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సమస్యలకు పరిష్కరించుకొనేందుకు పోరాటం చేసే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర రావు తెలిపారు. కనిగిరి యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో మిగిలిపోయే విధంగా మైనస్ పిఆర్సీని అమలుచేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న వారిపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు బనాయిస్తూ.. గొంతునొక్కే ప్రయత్నం చేస్తూ నియంతపాలన సాగిస్తోందన్నారు. అన్ని పథకాలనూ రద్దు చేసి తొమ్మిది పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న ఈ ప్రభుత్వం పనితీరు పట్ల ప్రజలు విసుగుచెంది తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గత 40 సంవత్సరాలలో పోలీస్‌రాజ్యం ఎప్పుడూ చూడలేదన్నారు. వైసిపి ప్రభుత్వం రాజ్యాంగేతర పాలన సాగిస్తోందన్నారు. బూర్జువా పార్టీలకు ఓట్లు వేయకుండా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, బాబురెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు వి.మాలకొండారెడ్డి, ఎస్‌కె. ఖాజాహుస్సేన్, ఎస్‌కె.ఖాజారహంతుల్లా, బ్రహ్మారెడ్డి, ఎన్ రామచంద్రారెడ్డి, రాము, జడ్.రమణయ్య, బత్తుల రుష్యేంద్ర పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన మహిళలకు సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో మంగళవారం మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో రాజకీయ నేత, మాజీ ఎంపిపి నాళం నరసమ్మ, కవయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి, అభినేత్రి చౌటపల్లి నీరజా చంద్రన్, తలసేమియా చిన్నారులకు తన సేవలందించే వేదాల విజయలక్ష్మి, నాట్య కళాకారిణి కుమారి చేజర్ల శంతనలను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా న్యాయసేవా విభాగం కార్యదర్శి కె.శ్యామ్ హాజరయ్యారు. సభకు మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ళ అరుణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి చివుకుల భరత్ కమల్, జిల్లా డిజైబుల్డ్ శాఖ ఏడీ జి.అర్చన, డాక్టర్ చాపల శాంతకుమారి, బొమ్మరిల్లు నిర్వాహకురాలు రాజ్యలక్ష్మి, కళామిత్ర మండలి అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, పాల్గొన్నారు. చందూ డాన్స్ అకాడమీ చిన్నారుల నత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జంకె వెంకటరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-మర్రిపూడి



జంకేను సన్మానిస్తున్న వాకా

వైఎస్ఆర్‌సిపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డిని మర్రిపూడి మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్‌లో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, వాకా సుబ్బారెడ్డి, తూగుట్ల నరసారెడ్డి, మీగడ ఈశ్వర్‌రెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, సానికొమ్ము సాంబశివారెడ్డి, మందడి మహేశ్వర్ రెడ్డి, సింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పత్తి వెంగన్న పాల్గొన్నారు.